


బాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. లింగాల కళాధర్, పూర్ణిమ దంపతులు లక్ష రూపాయల విలువ చేసే వెండి తాపడం అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్లలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 33వ వార్షిక తిరునాళ్లను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

శివ లింగాన్ని తాకిన సూర్య కిరణాలు



దాచేపల్లి : మండలంలోని గామాలపాడులో సుప్రసిద్ధ మహా శైవ క్షేత్రంలోని శివలింగాన్ని ఆదివారం సూర్య కిరణాలు తాకాయి. సూర్యోదయం అయిన తరువాత దేవాలయం తలుపులు తీయగానే నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడ్డాయి. దీంతో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు తరలివచ్చి శివ లింగాన్ని దర్శించుకుని, పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, సర్పంచ్ జంగా సురేష్ మహా శైవ క్షేత్రంలో పూజలు నిర్వహించారు. శివలింగాన్ని సూర్య కిరణాలు తాకడం అరుదైన ఘటన కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరునికి ఆదివారం వేకువజామున మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈవో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటాద్రినాయుడు మండపంలో స్వామిని ఉంచి, శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సరం ఆర్థిక, వ్యవసాయ, రాజకీయ రంగాల్లో జరిగే పరిణామాలను వివరించారు. అనంతరం భక్తులందరికీ ఉచితంగా పంచాంగాలను పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామికి కిరీటం బహూకరణ



గురజాల రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామికి రూ.5లక్షల విలువైన బంగారు పూత కలిగిన వెండి కిరీటాన్ని నందేల పెద్ద సైదారెడ్డి, నాగమ్మ, చిన సైదారెడ్డి, కోటేశ్వరమ్మ ఆదివారం బహూకరించారు. కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులకు అందజేశారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నరసరావుపేట: జిల్లాలో సోమవారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగ సందర్భంగా కలెక్టర్, పోలీసు కార్యాలయాల్లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని వారు కోరారు.

బలిజేపల్లిలో బరి తెగించిన పచ్చ బ్యాచ్



రాజుపాలెం: పాత కక్షల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసిన సంఘటన మండలంలోని బలిజేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో టీడీపీకి చెందిన గౌతుకట్ల హనుమంతరావు, గౌతుకట్ల గోపీచంద్, గౌతుకట్ల పెద నర్సయ్య, గౌతుకట్ల గోపీలు వైఎస్సార్ సీపీకి చెందిన గౌతుకట్ల సైదయ్య, వీరాంజమ్మలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సైదయ్యను వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో సైదయ్యను, వీరాంజమ్మలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, నాయకులు వేపూరి శ్రీనివాసరావు, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాసు లింగారెడ్డి, అచ్యుత శివప్రసాద్, లోక్ మాధవ్, సంకల తిరుమలరావు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి కృషి

- కలెక్టరేట్ ఉగాది వేడుకల్లో ఎంపీ లావు సూచన
- కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి పాటుపడదామన్న కలెక్టర్
- కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది సంబరాలు
- ఈ ఏడాది మంచి వర్షాలు
- వ్యవసాయంలో చక్కని దిగుబడులు
- విద్యార్థులకు మెరుగైన ఫలితాలు
- పంచాంగ శ్రవణంలో పేర్కొన్న పండితులు
- వివిధ రంగాల్లో కృషి చేసిన 16 మందికి సత్కారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు. చిత్రంలో ఎంపీ లావు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: తెలుగు వారి కొత్త ఏడాది ఉగాది నాడు ప్రజలంతా రానున్న సంవత్సరంలో ప్రణాళిక రచించుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో ఆదివారం సాంస్కృతిక, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది సంబరాలు నిర్వహించారు. ఎంపీ లావు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులకు మేళతాళాల మధ్య వేద పండితులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. ఉగాది పచ్చడి స్వీకరించి, జ్యోతి ప్రజ్వలనతో సంబరాలను ప్రారంభించారు. అనంతరం వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, వ్యవసాయంలో దిగుబడులు బాగా వస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఎర్ర పంటలకు ప్రసిద్ధి అయిన జిల్లాలో మిర్చి, కందులు, జొన్నలు, దుంపలు బాగా పండుతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. ముఖ్యంగా మెడికల్, ఇంజినీరింగ్, ఐసెట్, లాసెట్ వంటి ఉన్నత విద్య ఎంట్రెన్స్ టెస్టుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. మహిళల మాటకు విలువ, రాజకీయ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కుతాయని తెలిపారు. వ్యాపారాలు బాగా జరిగినా ఆశించిన స్థాయిలో లాభాలు చూడకపోవచ్చని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ పంట దిగుబడి సమయంలో సంక్రాంతి, అమ్మి సొమ్ము చేసుకునే సమయానికి ఉగాది పండగ నిర్వహించుకుంటామని తెలిపారు. ఆదాయ వినియోగం, వచ్చే ఏడాదికి వేయాల్సిన పంటల గురించి రైతులు ఆలోచించుకునే రోజు ఉగాది అని పేర్కొన్నారు. విద్యార్థులంతా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలోని చెడుని వదిలేసి, మంచి మార్గంలో ముందుకు సాగాలని కోరారు. జీవితం మొత్తం ఆనందంగా ఎవరికీ ఉండదని, కష్టనష్టాలను తట్టుకుని నిలబడటం అలవర్చుకోవాలని సూచించారు. ఈ విశ్వావసు నామ ఉగాది సంవత్సరం అన్ని వర్గాల వారికి చక్కని ఫలితాలనిస్తుందని ఎమ్మెల్యే చదలవాడ ఆకాంక్షించారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో కృషి చేసిన 16 మంది ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఏకా మురళి, ఆర్డీవో కె.మధులత, జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు సయ్యద్ జిలాని, రంగిశెట్టి రామకృష్ణ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పండితులకు సత్కారం

విజయ కీలాద్రిపై ఉగాది వేడుకలు

తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై ఆదివారం ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో విశ్వావసు నామ సంవత్సర ఉగాది నుంచి తొమ్మిది రోజులపాటు వసంత నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించామని తెలిపారు. ఉదయం హనుమ లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రులకు అభిషేకం అనంతరం పంచాంగ శ్రవణం, సుందరకాండ పారాయణ, అష్టోత్తర శతనామార్చన, సీతారామ చంద్రులకు కల్యాణ మహోత్సవం నిర్వహించామని తెలిపారు.



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

• మసీదులు ముస్తాబు



నరసరావుపేటలోని నాయబ్ బజార్ పెద్ద మసీదు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మసీదులు ముస్తాబయ్యాయి. నరసరావుపేటలో నాయబ్ బజార్ పెద్ద మసీదు, శ్రీరాంపురంలోని జామియా మసీదు, బరంపేటలోని మదీనా మసీదు, షాలిమ్‌నగర్ బిలాల్ మసీదు, ఇస్లామ్‌పేటలోని మర్కస్ మసీదు, రామిరెడ్డిపేటలోని మునవర్ మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సామూహిక నమాజ్ ప్రార్థనల్లో పాల్గొనే ముస్లింలకు ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా మైదానంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రొంపిచర్లలోని మసీద్‌ను కూడా ముస్తాబు చేశారు.

– నరసరావుపేట ఈస్ట్ / రొంపిచర్ల



రొంపిచర్లలోని మసీద్

బంగారు గరుడోత్సవం

మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం ఉగాది తిరువంజనోత్సవంతోపాటు స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం ఉగాది సందర్భంగా శనగల శేషాంజనేయ గోపాల్ పంచాంగ పఠనం చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి బంగారు గరుడోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తరించారు. అద్దాల మహల్ పవళింపు సేవలో గులాబీ పువ్వులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బంగారు గరుడోత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన నందికంటి వెంకట హనుమాన్ ప్రసాద్ వ్యవహరించారు.



మస్తిష్కం మరణ వేదన

బ్రెయిన్ స్ట్రోక్.. బీకేర్‌ఫుల్

- చిన్న వయస్సులోనే స్ట్రోక్ మరణాలు
- 80 శాతం పక్షవాతాన్ని నివారించవచ్చు
- అశ్రద్ధ చేస్తే ముప్పు తప్పదు
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం

యుక్త వయసులోనే స్ట్రోక్

కర్నూలు జిల్లా పాములపాడు మండలం ఎర్రగూడూరుకు చెందిన వెంకటనాగయ్య, పరిమళ దంపతుల కుమారుడు రిషికేష్ పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 17న టెన్త్ పరీక్షలు రాసి వచ్చాడు. సాయంత్రం విపరీతమైన తలనొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పి మంచంపై వాలిపోయాడు. కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కంగారు పడిన తల్లిదండ్రులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి బ్రెయిన్ స్ట్రోక్ అని నిర్ధారించారు. ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నారు. ఆధునిక జీవన శైలి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వయస్సుతో సంబంధం లేకుండా వస్తుందనేందుకు ఈ ఘటన ఓ ఉదాహరణ.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

జీజీహెచ్‌లో చికిత్స పొందిన బ్రెయిన్‌స్ట్రోక్ బాధితులు ఇలా..

సంవత్సరం	రోగుల సంఖ్య
2022	515
2023	540
2024	450

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. దీనినే పక్షవాతం అని కూడా అంటారు. దీనిని నూటికి 80శాతం నివారించవచ్చని, అవగాహన లేకపోవటం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు రోజూ 15 మంది వరకు పక్షవాతానికి గురైన వారు వైద్యం కోసం వస్తున్నారు. జిల్లాలో 30 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు మూడు నుంచి ఐదుగురు పక్షవాత బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఒక కోటి 70 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారు. వీరిలో 65 లక్షల మంది చనిపోతున్నారు. మన దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు పక్షవాతానికి గురవుతున్నారు. సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోవడం వల్ల వ్యాధి విషమంగా మారుతుందని, ఒక్కోసారి ప్రాణాంతకంగా పరిణమిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కొందరు ఆకుపసర్లు మింగుతూ కాలయాపన చేయడం వల్ల పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఎందుకొస్తుందంటే !

రక్తనాళాలు పూడుకుపోవటం వల్ల మెదడుకు రక్తసరఫరా ఆగిపోతే పక్షవాతం వస్తుంది. పక్షవాతం అంటే బ్రెయిన్ అటాక్. హార్ట్ అటాక్‌లాగే ఇది చాలా ప్రమాదకరం. రక్తపోటు(బీపీ) పెరిగి రక్తనాళాలు దెబ్బతిని చిట్లిపోవడం వల్ల పక్షవాతం వస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం, మెదడులో కణుతులు, రక్తంలో కొవ్వు పదార్థాల వల్ల పక్ష వాతం వచ్చే అవకాశం ఎక్కువ. మెదడువాపు, గుండెజబ్బులూ పక్షవాతానికి దారితీయొచ్చు. స్థూలకాయుల్లోనూ, 70 ఏళ్లు దాటిన వారిలో ఈ వ్యాధి అధికంగా వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు

పక్షవాతం వచ్చినవారిలో ఒకే వస్తువు రెండుగా కనబడటం, మాట తడబడటం, మింగుడు పడకపోవటం, కళ్లు, తల తిరగటం, తీవ్రమైన తల నొప్పి, వాంతులు, నడకలో తూలుడు, మూతి వంకరపోవటం, దృష్టి మందగించటం, కాళ్లు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి కోమాలోకి వెళ్తాడు.

ముందు జాగ్రత్తలతో రక్షణ

ముందు జాగ్రత్త చర్యలతో పక్షవాతం రాకుండా చూసుకోవచ్చు. రక్తపోటు, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాలి. మద్యం, ధూమపానాలకు దూరంగా ఉండాలి. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినకూడదు. రోజూ వ్యాయామం చేయడం మంచిది.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పక్షవాతం బాధితులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. పది పడకలతో రూ.50 లక్షలతో నిర్మించిన ఆధునిక స్ట్రోక్ యూనిట్‌లో 2015 అక్టోబర్ నుంచి వైద్యసేవలు అందిస్తున్నాం. రెండు తెలుగురాష్ట్రాల్లో స్ట్రోక్ యూనిట్ కలిగి ఉన్న ఏకైక ప్రభుత్వ ఆస్పత్రి గుంటూరు జీజీహెచ్.

– డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, న్యూరాలజీ వైద్యవిభాగాధిపతి గుంటూరు జీజీహెచ్

20శాతం కేసులకు ఆపరేషన్లు తప్పనిసరి



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో నూటికి 80శాతం మందికి మందులతో నయమైపోతుంది. 20శాతం మంది మెదడులో రక్తపుగడ్డ పెద్దసైజులో ఉంటుంది. అప్పుడు శస్త్రచికిత్స తప్పనిసరి.

– డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, జీజీహెచ్ గుంటూరు.

గోల్డెన్ అవర్ కీలకం



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తర్వాత తొలి మూడు గంటలూ గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఈలోపు సరైన వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, గుంటూరు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



చినగంజాం: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామానికి ఏప్రిల్ 1వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో గ్రామంలో ఆదివారం కలెక్టర్, ఎస్పీ తుషార్ డూడీలు పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు కేటాయించిన బాధ్యతలను సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలన్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజావేదిక వద్ద 2 వేల మంది ప్రజలు హాజరయ్యే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఆయనవెంట జేసీ ప్రఖర్ జైన్, డీఆర్ఓ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాధవ నాయుడు తదితరులు ఉన్నారు.

• న్యాయం కావాలి





పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతూ గుంటూరులో క్రైస్తవ, దళిత సంఘాలు నిరసన బాట పట్టాయి. లాడ్జి సెంటర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీలు అరవింద్ (పశ్చిమ), బి.సీతారామయ్య (ఎస్‌బీ)కి వినతిపత్రాలు అందించారు.

– నగరంపాలెం

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు

అచ్చంపేట: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో పల్నాడు జిల్లా రెజ్లింగ్ అమెచ్యూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్– 20, అండర్ –15 విభాగాల్లో బాలబాలికలకు రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెజ్లింగ్ అమెచ్యూర్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం మాట్లాడుతూ ఏప్రిల్ 4,5,6 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను అసోసియేషన్ చైర్మన్ వై.రమేష్‌బాబు ప్రారంభించారు.

ఎంపికైన బాలబాలికలు

- అండర్ 15 బాలికల విభాగంలో సాగార్జునసాగర్‌కు చెందిన ఎస్.లావణ్య, బి.అలేఖ్య, ఎం.పూజిత, ఎ.పూజిత, ఎస్.మేరి, డి.శృతి, జి.గాయత్రి
- అండర్ 15 బాలుర విభాగంలో అచ్చంపేటకు చెందిన పి.నాగచైతన్య, ఒ.గౌరి ప్రతాప్, సీహెచ్.రాంబాబు, ఎ.ప్రణీత్, అడవితక్కెళ్లపాడుకు చెందిన కె.ఆదిత్య, వి.పవన్‌కుమార్, కె.అంకిత్‌రెడ్డి, దుగ్గిరాలకు చెందిన అనంద్ భానుప్రసాద్



ఎంపికైన క్రీడాకారులు

- అండర్ 20 బాలికల విభాగంలో నాగార్జునసాగర్‌కు చెందిన ఆర్.గాయత్రి బాయి, ఎం.దీపిక భువన, వినుకొండకు చెందిన కె.భ్యాలా, బ్రాహ్మణకోడూరుకు చెందిన డి.నెహశ్రీ
- అండర్ 20 బాలుర విభాగంలో కె.బాలు నాయక్(రామకృష్ణాపురం), ఎస్.శ్రీకర ప్రసాద్(గోరింట్ల), పి.సుమంత్(ఆవులవారిపాలెం), ఎ.సి.బాల కోటేశ్వరరావు (పిడుగురాళ్ల) బి.విజయ్‌బాబు (కాజ), కె.కిరణ్(చల్లగరిగ), డి.కుమార్ (లగడపాడు) పి.చంటి(బాలేమర్రు), కె.భరత్‌కుమార్(రావిపాడు), డి.కళ్యాణ్ (గోళ్లపాడు) కె.ప్రభాకర్ (ఓబులేసుపల్లి)ఎం.అఖిల్ (పిడుగురాళ్ల)

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రంజాన్ శుభాకాంక్షలు



మాచర్ల: పల్నాడులోని ముస్లింలంతా పవిత్ర రంజాన్ పండగను ఘనంగా నిర్వహించుకోవాలని, అల్లా ఆశీస్సులు పొందాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలు అందరికీ రంజాన్ సందర్భంగా ఈద్ ముబారక్ తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ మీదపడి యువకుడి మృతి



చిలకలూరిపేట టౌన్: ట్రాక్టర్ ఇంజన్ మీదపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రామచంద్రాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రూరల్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన జడా యాకోబు రెండో భార్య కుమారుడు జడా స్వామియేలు(19) పదో తరగతి పూర్తి చేశాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యను మధ్యలోనే ఆపి కూలీ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ ఆసామి వద్ద రాత్రి 6 గంటల సమయంలో ట్రాక్టర్ తీసుకుని మరోచోట పెట్టేందుకు బయలుదేరాడు. ఎస్సీ కాలనీ వద్ద మలుపు తిప్పే క్రమంలో ఓవర్ స్పీడ్‌లో అదుపుకాక బ్రిక్స్ రాళ్లపై ట్రక్కు ఎక్కింది. ట్రాక్టర్ నడుపుతున్న స్వామియేలు కిందపడిపోయాడు. అదే సమయంలో ఇంజన్ అతనిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలిని చేరుకున్న రూరల్ ఎస్ఐ జి. అనిల్‌కుమార్ వివరాలను నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నసీర్ అహ్మద్‌కు ఉగాది పురస్కారం



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహ్మద్ కళారత్న ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని తుమ్మపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఉగాది సంబరాల్లో ఆయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తాను రచించిన 'భారత స్వాతంత్య్ర ఉద్యమం.. ఆంధ్ర ముస్లిం యోధులు' పుస్తకాన్ని చంద్రబాబుకు నసీర్ అహ్మద్ అందజేశారు.

పరిహారంలో అధికారుల పక్షపాతం

ఎంపీ లావుకు రైతుల విన్నపం

నరసరావుపేట రూరల్: నకరికల్లు–ఓడరేవు జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న తమకు సమన్యాయం చేయాలని కేసానుపల్లి రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కోరారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటగదికి శంకుస్థాపనలో పాల్గొనేందుకు కేసానుపల్లి వచ్చిన ఎంపీని గ్రామ రైతులు కలిశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు కోసం కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, రావిపాడు, నల్లగార్లపాడు గ్రామాల రైతులు భూములు కోల్పోతున్నారని తెలిపారు. జాతీయ రహదారుల అధికారులు జొన్నలగడ్డ రైతులకు ఎకరానికి రూ.1.75కోట్లు , ఆ గ్రామం పక్కనే తమ గ్రామానికి మాత్రం ఎకరానికి రూ.55లక్షలు మాత్రమే ప్రకటించారని వాపోయారు. బహిరంగ మార్కెట్లో విలువ సమానంగా ఉన్నా పరిహారం విషయంలో అధికారులు పక్షపాతం చూపిస్తున్నారని తెలిపారు. జొన్నలగడ్డ రైతులకు చెల్లించిన ప్యాకేజీనే తమకు చెల్లించాలని రైతులు కోరారు.

పరిహారాన్ని అన్ని గ్రామాలకు ఒకే విధంగా ఇవ్వాలి

నరసరావుపేట: చీరాల వాడరేవు నుంచి నకరికల్ అడ్డ రోడ్డు వరకు నూతనంగా నిర్మించనున్న ఎన్‌హెచ్ 167–ఏ జాతీయ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన బైపాస్ రోడ్డు, జొన్నలగడ్డ రైతులకు ప్రకటించిన ప్యాకేజీనే కేసానపల్లి, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు కూడా అమలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కు వద్ద ఆందోళన చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో జొన్నలగడ్డ రైతులకు ఎకరానికి రూ.1.70కోట్లు నిర్ణయించారని తెలిపారు. మిగిలిన గ్రామాల రైతులు తమకు అదే ప్యాకేజీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును రైతులు కలిసి తమకు న్యాయం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారని చెప్పారు. ఈ ప్రాంత రైతులు చేసే ఉద్యమానికి తాము సంఘీభావం తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగొన్నల శ్రీనివాసరావు, ఆర్‌టీఐ కార్యకర్త వసంతరావు పాల్గొన్నారు.



ఎంపీ లావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



గాంధీ పార్కు ఎదురుగా ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తెలుగు భాషా వైభవాన్ని ముందు తరాలకు అందించాలి



ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



హాజరైన వారు

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలుగు భాషా వైభవాన్ని ముందు తరాలకు అప్పగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఉగాది పండగ సందర్భంగా సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం సాహితీ వసంతోత్సవం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌బీ రామమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను మండల స్థాయిల్లోనూ నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ.కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని అన్నారు. పీ–4 మంచి కార్యక్రమం అని, ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని చెప్పారు. సంగీత విద్వన్మణి ఆర్.సూర్యలక్ష్మీ శిష్య బృందంతో విష్ణు సహస్రనామ పారాయణం చేయగా, గుదిమెళ్ల శ్రీ కూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం చేపట్టారు. అనంతరం సాహితీ సమ్మేళనంలో సుప్రసిద్ధ సినీ గేయ, గజల్ రచయిత రసరాజు, సుప్రసిద్ధ సినీ నటులు కేదార్ శంకర్, హాస్య రచయిత డాక్టర్ పీవీ రామ్‌కుమార్, సంభాషణ రచయిత కె.కృష్ణవేణి, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్ పాల్గొన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్.లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఆర్.రాము, టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

తాడేపల్లి క్రీడాకారుడికి స్కేటింగ్‌లో పతకాలు



మెడల్స్‌తో హాశిష్

తాడేపల్లి రూరల్: తైవాన్‌లో ఈనెల 24 నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో తాడేపల్లి జోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ సత్తాచాటాడు. చైనీస్ తైపి రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో హాశిష్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టైల్, ఇన్‌లైన్, సోలో డ్యాన్స్ పోటీల్లో తలపడగా మూడు విభాగాల్లో రెండవ స్థానంలో నిలిచి మూడు రజిత పతకాలు సాధించాడు. తమిళనాడు కోలాచీలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లోనూ హాశిష్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. కోచ్ పి.సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రోలర్స్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నీలిమ, శ్రీకాంత్ హాశిష్‌కు అభినందనలు తెలిపారు.

అన్న వస్తున్నాడు .. కోడిగుడ్డు కూర వండు !

- ఈ రోజు మీ ఇంట్లోనే ఉంటాడు.. జాగ్రత్తగా చూసుకో !
- అన్న ఎమ్మెల్యే పక్కనే ఉంటాడు.. తెలుసుగా ?
- ఓ గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తకు ఫోన్‌లో అధికార పార్టీ నేత అనుచరుడి వేధింపులు

సత్తెనపల్లి: ఏం మేడం ఏం చేస్తున్నారు .. అన్న వస్తున్నాడు .. కోడి గుడ్డు కూర వండు అంటూ ఓ గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తకు టీడీపీ నాయకుడి అనుచరుడు ఫోన్ చేసి వేధింపులకు గురి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు అదే గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధి పక్కన ఉండే అనుచరుడు మూడు రోజుల కిందట ఫోన్ చేసి వేధింపులకు గురి చేశాడు. ఈ రోజు అన్న మీ ఇంట్లోనే ఉంటాడని జాగ్రత్తగా చూసుకోవాలన్నాడు. అప్పుడప్పుడు వచ్చిపోతుంటాడని, అన్న ఎమ్మెల్యే పక్కనే ఉంటాడు తెలుసుగా ? అంటూ ఫీంకరించాడు. దీంతో ఏం చేయాలో పాలు పోక అంగన్‌వాడీ కార్యకర్త ఫోన్‌లో మాట్లాడిన మాటలు అన్నీ ఆమె రికార్డింగ్ చేసింది. వాటిని గ్రామానికి చెందిన మరో అధికార పార్టీ నాయకుడు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆయన ఆమెను వెంటబెట్టుకొని ఎమ్మెల్యే వద్దకు తీసుకువచ్చాడు. ఆ వీడియో విని పించగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం ఎమ్మెల్యే వద్దకు వచ్చిన సంగతి తెలియడంతో గ్రామంలో ఫోన్ చేసిన వ్యక్తికి పార్టీ నేతలే స్వల్పంగా దేహశుద్ధి చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగవని ప్రాధేయపడటంతో కేసు నమోదు చేయకుండా రాజీమార్గం చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం ఉగాది పర్వదినాన ఆదివారం బయటకు రావడంతో పట్టణం, మండలంలో చర్చనీయాంశంగా మారింది.

గోవింద నామస్మరణతో మారుమోగిన నేతి వెంకన్న ఆలయం



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: ఉగాది పండుగను పురస్కరించుకుని పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కొండపై స్వయంభువుగా వెలసిన నేతి వెంకన్నస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరారు. సమీప గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు వచ్చారు. స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలంటూ నీరాజనాలు పలికారు. పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పును స్వామికి భక్తులు సమర్పించారు. పశు సంపదను కాపాడాలని నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. అంచులవారిపాలెం మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. తిరునాళ్లలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాతలు అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు. తాగునీటికి కొదవ లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో గణపతి సురేష్ తెలిపారు.

1, 2 తేదీల్లో జాతీయస్థాయి నాటకోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన డీఎల్ కాంతారావు

తెనాలి: పట్టణానికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో 14వ జాతీయస్థాయి నాటకోత్సవాలు ఏప్రిల్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్నారు. కళాపరిషత్ వ్యవస్థాపకుడు డీఎల్ కాంతారావు, ప్రధాన కార్యదర్శి పీఏ స్వార్ బ్రహ్మాచార్యులు ఆదివారం విలేకరుల సమావేశంలో నాటకోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఒకటో తేదీ సాయంత్రం 6.30 గంటలకు నాటకోత్సవాల ప్రారంభసభకు కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటుడు నాయుడు గోపి అధ్యక్షత వహిస్తారు. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ నటి, రచయిత్రి, దర్శకురాలు కె.విజయలక్ష్మికి నందమూరి తారక రామారావు లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా బహూకరిస్తారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి 'జేబు చెప్పిన ఊసులు' సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తారు. స్నిగ్ధ రచించిన ఈ నాటకానికి మంజునాథ దర్శకత్వం వహిస్తారు. 2వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్, తెనాలి వారిచే 'ది లెసన్' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుంది. స్నిగ్ధ రచించిన ఈ నాటికను పీఏస్వార్ బ్రహ్మాచార్యులు దర్శకత్వంలో ప్రదర్శిస్తారు. రాత్రి 7.30 గంటలకు శ్రీసాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి పౌరాణిక పద్యనాటకం 'శశిరేఖా పరిణయం' (మాయాబజార్) ప్రదర్శిస్తారు. విద్వాన్ కన్యశ్రీ రచించిన ఈ నాటకానికి బీవీఏ నాయుడు దర్శకత్వం వహిస్తారు.

ఎన్జీటీ కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు



ప్రతినిధులతో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ పి.కృష్ణయ్య, సభ్యుడు పీజే రత్నాకర్

ఏఎన్‌యూ(గుంటూరు): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని విగ్యాన్ భవన్‌లో ఈనెల 29, 30 తేదీలలో జరిగిన 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్– 2025'లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్యతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ సదస్సును ఈనెల 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా 30వ తేదీ సాయంత్రం జరిగిన ముగింపు సభకు ఉపరాష్ట్రపతి జగ్దీష్ ధన్‌ఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజులపాటు జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో ప్రస్తుతం పర్యావరణం ఎదుర్కొంటున్న సవాళ్లు, పర్యావరణ నిర్వహణలో ఉత్తమ పద్ధతుల అనుసరణ, పర్యావరణ పరిరక్షణలో పలు విభాగాల భాగస్వామ్యం, సుస్థిర పర్యావరణ నిర్వహణ కోసం భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాలపై దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరై చర్చించారు. వారి అభిప్రాయాలను తెలియజేసి నివేదికల రూపంలో అందజేశారు. ఈ సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్, ఎన్‌జీటీ చైర్మెన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరామణి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తిని కొట్టి చంపిన కేసులో తాడేపల్లి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి ఆదివారం కోర్టుకు హాజరుపరిచారు. నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ కల్యాణ్‌రాజు నేతృత్వంలో నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఈనెల 27న గుర్తు తెలియని సుమారు 30 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి కేఎల్‌రావు కాలనీలోని హోసన్న ప్రార్థనా మందిరం వద్ద దుర్గాశి రాజేశ్వరి ఇంట్లోకి దూరి ఆమెపై అఘాయిత్యం చేయడానికి యత్నించాడు. రాజేశ్వరి బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వల్లభాపురం జశ్వంత్, వల్లభాపురం కోటేశ్వరరావు, బోజంగి సింహాచలం నాయుడు మరో ముగ్గురు ఆ వ్యక్తిని పట్టుకునేందుకు యత్నించారు. అయితే, అతడు కొండపైకి పారిపోయాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకుని పిడిగుద్దులు కురిపించడంతో మరణించాడు. ఆ తర్వాత ఆ వ్యక్తిని రోడ్డుపైకి తీసుకొచ్చి పడేసి పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసిన తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు ఎస్ఐ జె.శ్రీనివాసరావుతో కలిసి దర్యాప్తు చేశారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద తిరుగుతున్న వల్లభాపురం జశ్వంత్, వల్లభాపురం కోటేశ్వరరావు, బోజంగి సింహాచలం నాయుడును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ హత్యలో పాలుపంచుకున్న మరో ముగ్గురు మైనర్లు అని తేలింది. వారినీ త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. అయితే చనిపోయిన వ్యక్తి ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన



దుకాణ ఏర్పాటును నిరసిస్తున్న ప్రాంత ప్రజలు

తెనాలి రూరల్: స్థానిక ముత్తెంశెట్టిపాలెంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ముత్తెంశెట్టిపాలెం ప్రధాన సెంటరు వద్ద మద్యం దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా పాత రత్నా టాకీసు వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ముత్తెంశెట్టిపాలేనికి తరలించారు. ఆదివారం దుకాణాన్ని తెరవడంతో స్థానికులు వ్యతిరేకించారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని ఆక్షేపించారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై నిరసన తెలుపడం సరికాదని, సంబంధిత ఎక్సైజ్ అధికారులను, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ అభ్యంతరాన్ని తెలియజేయాలని సూచించారు. స్థానికులు మాత్రం ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

ఉల్లాసంగా ఎడ్ల పందేలు



ఎడ్ల జత యజమానికి బహుమతిని అందజేస్తున్న సినీ రచయిత బుర్రా సాయిమాధవ్



నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ఎడ్ల జత

తెనాలి రూరల్: తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. వారం రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. రెండోరోజు ఉత్సాహంగా పందేలు సాగాయి. తెనాలి, పరిసర ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలిరోజు శనివారం రాత్రి జరిగిన రెండు పళ్ల విభాగం పోటీల్లో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన పెరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3592.01 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ జత యజమానికి సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ బహుమతిని అందజేశారు.

నాలుగు పళ్ల విభాగంలో..

రెండోరోజు నాలుగు పళ్ల విభాగం పోటీలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ విభాగంలో మొత్తం 14 జతల ఎడ్లు పోటీకి దిగాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా జే పంగలూరుకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ ఎడ్ల జత ముందంజలో ఉంది. పోటీలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. పోటీలకు రిఫరీగా సూరపనేని రాధాకృష్ణ వ్యవహరించారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో తీవ్ర అన్యాయం

- బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి
- వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం



రేపల్లె రూరల్: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం కోరారు. పట్టణంలోని తన చాంబర్‌లో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ముస్లింల హక్కులు, స్వేచ్ఛను కాలరాయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతూ వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోందన్నారు. బిల్లు ఆమోదం పొందితే దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించటం బాధాకరమన్నారు. సమస్య ముస్లిం సమాజందే కాకుండా దేశ సమస్యగా ప్రతి ఒక్కరూ భావించి బిల్లు సవరణను అడ్డుకోవాలని ఆమె కోరారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే ముస్లింల భావితరం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులపై ప్రైవేటు సంస్థలకు, ప్రభుత్వాలకు ఎటువంటి అధికారం ఉండదని, ఆస్తులపై అధికారం చేజిక్కించుకోవాలనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్‌లో ముస్లింల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముస్లిం పెద్దలు వక్ఫ్ బోర్డు ద్వారా పలు ఆస్తులను ఏర్పరిచారని, వాటిని స్వాధీనం చేసుకోవాలన్న కుట్రతో బిల్లును తెరపైకి తెచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ బిల్లును వ్యతిరేకించాలని కోరారు.